# ఉత్తమోత్తమ సేవ

పంకజాక్షుని చింత పలుమారు సేయక
పరుల నిందించుట పాడికాదు
విష్ణుసంకీర్తనల్ వీనుల వినకుండ
పరుల స్తుతులజేయ భ్రాంతికాదె
శేషశయనుజాల చెలగి కీర్తింపక
పరుల కీర్తించుట భావ్యమగునె
దామోదరుని రూపు ధ్యానము చేయక
పరుల దూషించుట పాడియగునె
శ్రీరమానాథునెప్పుడు చిత్తమందు
తలచువారికి మోక్షంబు తధ్యమప్ప
ఇంతకన్నను వేఱెద్ది ఎరుక పఱతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

దివ్యాత్మస్వరూపులారా!

మానవులు లోకమందు అనేక విద్యలు నేర్చుచున్నారు. అనేక యంత్రములను సృష్టించుచున్నారు. అనంతమైన జ్ఞానమును ఆర్జించుచున్నారు. కానీ, దొరకవలసిన శాంతి లభించటం లేదు. నానాటికీ లౌకిక జీవితనదిలో అనేకులు కొట్టుకొని పోవుచూ, శాంతికి అతిదూరమైపోతున్నారు. దివ్యమైన మానవత్వము ప్రాప్తించిననూ, సత్యమార్గమును గుర్తించక దివ్యజీవితాన్ని వ్యర్థంగావించుకోటం కర్తవ్యం కాదు. విద్యలను నేర్చినంతమాత్రమున, యంత్రములను సృష్టించినంతమాత్రమున జ్ఞానులమని విఱ్ఱవీగినంతమాత్రమున, తమ మానవత్వ రహస్యాన్ని తెలుపుటకు వీలుకాదు. సృష్టి రహస్యమును గుర్తించుటకు ఈ విద్యలు కాదు ప్రమాణములు. ఏ రహస్యమును గుర్తించిన సర్వరహస్యములు గోచరమగునో, పలుచిక్కులు దూరమగునో, ఏ విద్యలు నేర్చిన సర్వవిద్యలు అవగతములగునో అట్టి దివ్యమైన విద్య ఒక్కటి మాత్రమే! చెట్టును కొట్టదలచిన వాడు వేరును కొట్టినప్పుడే దానిని పడదోయవచ్చునుగాని, ఆకులను చీల్చుచూ, కొమ్మలను కొట్టుచూ వచ్చినప్పుడు వృక్షము నశించుటకు వీలుకాదు.

ఋషులు అనేకవిధములైన ప్రయత్నములు సల్పి, సాధించి, మనకు అందించిన సుధానిధి, ఆత్మవిద్య. ఈ రహస్యమును విదేశీయులు గుర్తించి, భారతదేశైహిక, ఆముష్మిక సంపపత్సాధన ఆదర్శవంతమైనదని వేనోళ్ళ వర్ణిస్తూ వచ్చారు. కాని, ఇట్టి పవిత్ర విద్య ఇల్లంతయును జ్యోతివలె వ్యాపించి, ప్రకాశించుచున్నప్పటికిని, భారతీయులు దీపము క్రిందనే ఉన్నారు. దీని క్రీనీడ వారి ప్రారబ్ధంగా రూపొందుతూ వచ్చింది. మన ముత్తాతలు, తాతలు, తండ్రులు పవిత్రమైన భారతీయ సంస్కృత గ్రంథములను పఠించి, వర్ణించి, స్మరించి, పారాయణము జరుపుతూ అనేకవిధములుగా శాంతిని అనుభవిస్తూ వచ్చారు. భారత, భాగవత, రామాయణ, భవద్గీతాది గ్రంథములను పఠించి, వాటి నీతులను హృదయమునకు చేర్చుకొని, నిత్యజీవితమునందు అనుభవించుతూ, పూజాపీఠములపైన ఉంచి, పవిత్రమైన హృదయములతో పూజించుచూ వచ్చారు.

వారి హృయములను, నీతి భావములచే నింపుకొని ఆచరణరూపమైన అనుభూతులను అందించుచూ సమాజమునకు సేవ సలుపుతూ వచ్చారు. దురదృష్టవశాత్తు ఆధునిక యుగము ప్రారంభమై, కేవలము నవనాగరికతకు వారు లొంగిపోయి, ఈ పవిత్ర గ్రంథములను విశ్వసించక అవి అనాగరికతా లక్షణములని భావించుచూ ఆ 'చెత్తపట్టిన చిత్తు'లను బయట పారవేస్తూ వచ్చారు, ఈనాటి ప్రజలు. భారతీయులు పారవేసిన పవిత్ర గ్రంథములను పాశ్చాత్యులు స్వీకరించిరి. మహాభాగ్యమని లోలోపల భావించుచూ, వాటిని తీసుకొనిపోయి పఠించి లోనున్న రహస్యములను చక్కగా పరిశీలనచేసి, వాటి ద్వారా ఈనాడు భారతదేశీయులు ఉన్నతస్థానమునందున్న వారుగా భావించుకుంటున్నారు.

అధర్వణవేదమును గ్రహించిన జర్మనీ ప్రజలు మన గ్రంథములందున్న అస్త్రశస్త్ర విద్యలను ఆధునిక వైద్యమును గ్రహించి, దానిని తిరిగి భారతదేశమునకే ఒక విచిత్రమైన రూపమున అందిస్తూ వస్తున్నారు. 'తన గృహమునందుండిన పంచభక్ష్య పరమాన్నముల కంటే, 'పొరుగింటి పుల్లగూర రుచి' అన్నట్లు భారతీయులు సర్వ రహస్యముల నెరింగినవారైననూ, సర్వశాస్త్రములను క్షుణ్ణంగా గుర్తించినవారైననూ పాశ్చాత్యులు అందించునట్టి ఈ అపవిత్రభావాలచే ఆకర్షింపబడుచూ వస్తున్నారు.

ఈనాటి విద్యార్థులు కేవలము తెలివితేటలను మాత్రమే పెంచుకొనుచూ, సుగుణములను విస్మరిస్తూ, తమ మానవత్వాన్ని

మరచి, భౌతిక జీవితమే ప్రధాన లక్ష్యముగా పాటిస్తూ వస్తున్నారు. విద్యార్థులు సుగుణముల నభివృద్ధిగావించుకొనునట్లు అధ్యాపకులు ప్రయత్నించాలి. తెలివితేటలకంటే గుణములే ప్రధానమైనట్టివి. ఈనాటి విద్యారంగమందు ఏవిధమైన నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక గౌరవమనేది లేకపోవటంచేతనే, విద్యార్థులు అధోగతికి దిగజారుటకు మూలకారణమైనది. నైతిక గౌరవమంటే ఏమిటో వారు తెలియని స్థితిలో వున్నారు. తమ జీవితమునకు సమాజ క్షేమమే ప్రాణమని వారు అర్థం చేసుకోవడం లేదు. ఎన్ని విద్యలు నేర్చినప్పటికీ, పరోపకారబుద్ధి లేకున్నచో అది అపవిత్రమైన భావాన్ని పెంచుతుంది. పరోపకార బుద్ధి మానవత్వజ్యోతిని ప్రకాశింపజేస్తుంది.

ఈనాటి విద్యార్థులు ఈ అల్పవిద్యలను అధికంగా ఆర్జించి తమ హృదయవికాసాన్ని పెంచుకొనలేకపోవటమేగాక అహంకారాన్ని మరింత పెంచుకోటానికి ప్రయత్నిస్తున్నారు. అహంకారము సుగుణాన్ని మరపింప చేస్తుంది. విద్యార్థులు దేశక్షేమాన్నిగాని, సమాజౌన్నత్యమునుగాని గుర్తించలేకపోతున్నారు. కంటికి పెట్టుకొన్న అహంకారమనే అద్దముచేత తమ మానవత్వాన్నే మరచిపోతున్నారు. కనుకనే, ఈ మానవత్వాన్ని ఉద్ధరించుటకై విద్యార్థులు ఎంతైననూ శ్రమపడవలసి వస్తుంది.

రాగ ద్వేషరహితమైన చిత్తము, అసత్యాదులతో కూడని వాక్కు, పాపపంకిలముకాని దేహము ఈనాడు మనకవసరం. కనుక, మానవుని రాగద్వేషములను అరికట్టుటకై పవిత్రమైన సుగుణములను పెంపొందించుకోటానికి స్వార్థము, అసూయ, అహంకారము అనెడి ఈ మూడు పిశాచముల బారినుండి దూరం చేయటానికి అధ్యాపకులు ఎంతైనా ప్రయత్నించాలి. ఈ మూడు దుర్గుణములు హృదయమునందు ప్రవేశించెనా ఇంక మానవత్వమును ఏమాత్రమూ గుర్తించుటకు వీలుకాదు. స్వార్థరహితసేవకు ముందంజ వేయాలి. వృక్షములు స్వార్థరహిత సేవను సల్పుతున్నాయి. తమను మెచ్చుకున్నవారుకానీ, తమను ద్వేషించేవారుగానీ తమఛాయను వచ్చి కూర్చున్నప్పుడు అందరికీ సమానముగా చల్లని నీడను అందించి హాయిని చేకూర్చుచున్నవి వృక్షములు. నదులు, గోవులుకూడ స్వార్థరహితమైన సేవను సల్పుతున్నాయి. సమాజానికి వృక్షములు, గోవులు, నదులు లేకుండిన క్షణకాలమైననూ జీవించుటకు వీలుకాదు. స్వార్థరహిత జీవుల ద్వారా సుఖములననుభవిస్తున్న మానవుడు, కేవలము స్వార్థపరుడై జీవిస్తున్నాడంటే, ఇది కేవలము మానవత్వానికే ఒక అగౌరవము. కనుక, మానవుడు ఆర్జించినట్టి విద్యాధనమునుకానీ, ఇంకేవిధమైన ఐశ్వర్యమునుకానీ స్వార్థరహిత కార్యములందు ప్రవేశపెట్టడం ప్రధాన కర్తవ్యం.

అధ్యాపకుల ఆస్తి విద్య. ఈ విద్యను సక్రమ మార్గములో, స్వార్థరహిత భావముతో, జనసంబంధమైన గుణపోషణ నిమిత్తమై విద్యార్థులహృదయానికి హత్తుకొనేటట్లు చేయుటకు అధ్యాపకులు సంసిద్ధులై ఉండాలి. భారతదేశమందు శ్రీమంతులు, గొప్పగొప్ప విద్యావంతులు, గొప్పగొప్ప పీఠాధిపతులు, మహా మహారాజులు లేకపోలేదు. ఇట్టి పవిత్రస్థానమును అందుకొన్నట్టి వ్యక్తులు ఉండిప్పటికీ, శాంతి సంతోషములకు నోచుకోలేకపోతున్నారంటే మూలకారణము ప్రవర్తనల దోషమే. ఈనాడు అహంకారస్వార్థములు అందరి హృదయములందు ప్రవేశించి, తమ దివ్యశక్తులకు అనేకవిధములైన అవాంతరములు కల్పిస్తూ వస్తున్నవి. కనుక, ఈ దుర్గుణములు దూరముచేసే నిమిత్తమై విద్యార్థులహృదయాలను పవిత్రపరచి తద్వారా భావిభారతోద్ధారకులుగా తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులపై ఉన్నది. ఆధ్యాపకులు ఆదర్శమూర్తులు. వారాచరించి విద్యార్థులకు బోధించుటకై పూనుకోవాలి. ఎట్టి అధ్యాపకులో అట్టి విద్యార్థులుగా రూపొందుతారు. అధ్యాపకులు 'వాటర్ ట్యాంక్' వంటివారు. విద్యార్థులు కేవలం ట్యాప్స్‌వంటివారు. ట్యాంక్‌లో ఎట్టి నీటిని మనం నింపుదుమో ట్యాప్‌లో అట్టి నీరే వస్తుంది. కనుక, అధ్యాపకుల హృదయమనే 'ట్యాంక్'లో పవిత్ర, నిస్వార్థ భావములు చేర్చుకున్నప్పుడే, ఈ విద్యార్థులనెడి ట్యాప్స్‌నందు పవిత్రమైన భావములు రూపొందుటకును, ప్రకటించుటకును, వికసించుటకును అవకాశము ఏర్పడుతుంది.

ఈనాడు సత్యసాయి బాలవికాస్ గురువులు, యించుమించి ఐదువేలమంది వున్నారు. ఒక్కొక్క ఆధ్యాపకుడు నూరుమంది విద్యార్థులను చక్కదిద్దిన దేశము ఎంతో బాగుపడుటకు అవకాశము ఏర్పడుతుంది. బాలవికాస్ అధ్యాపకులు ఐదువేలమంది ఉన్నప్పటికీ, మనము ఈ నాలుగు సంవత్సరములనుండి సాధించిన ఫలితమేమిటని ఒక పర్యాయము మనం సింహావలోకనం సలపాలి. మనం చేసే ప్రతి పనినీ క్షణక్షణము పరిశీలిస్తూ రావాలి. ఏ గురువునందు సాత్వికమైన భావనలుండునో, ఆ గురువు చెంత ఆధ్యయనం చేసే విద్యార్థులకు అలాంటి సాత్విక భావాలు అభివృద్ధి చెందుతుంటాయి. కనుక, విద్యార్థులయందు పవిత్రమైన భావములు అలవడుటకు మొట్టమొదట అధ్యాపకులు పవిత్ర గుణములను పెంపొందింపచేసుకోవాలి. మొట్టమొదట అధ్యాపకులు ద్వేషాసూయలు, సంకుచిత భావములు, తమలో ఎంతమాత్రము ప్రవేశించకుండా చూచుకోవాలి. ముఖ్యముగా అధ్యాపకులు తమ జీవితములో ఏమాత్రమూ ప్రవేశించకుండా చూసుకోవాలి.

ఈ అధ్యాపకులలో కొన్ని కొన్ని పార్టీలు బయలుదేరకూడదు. కొంతమంది అధ్యాపకులు తమ పేరుప్రతిష్ఠలను అభివృద్ధి గావించుకుంటుంటే మరికొంతమంది అధ్యాపకులు వారిపై అసూయాభావాన్ని అధికంచేసుకుంటున్నారు. అధ్యాపక

సోదరసోదరీమణులు తాము, దివ్యాత్మతత్త్వముయొక్క బిడ్డలుగా విశ్వసిస్తూ, ఏకాత్మభావాన్ని అభివృద్ధి పరచుకోవాలి. అంతో, ఇంతో అప్పుడో ఇప్పుడో కొన్ని విరుద్ధమైన భావాలు మానవునియందు చెలరేగుట మానవత్వ లక్షణం. కానీ, మీరు సత్యసాయి బాలవికాస్ గురువులుగా ప్రవేశించారు. ఇతర గురువులయందు ఏవిధమైన దోషములు ప్రవేశించినప్పటికీ కొంత ప్రమాదము ఏర్పడదు. కానీ, సత్యసాయి బాలవికాస్ గురువులయందు కొన్నివిధములైన దుర్గుణములు ప్రవేశిస్తే అన్నివిధములైన అవాంతరములు అడ్డు తగులుతుంటాయి. కనుక, బాలవికాస్ గురువులు 'గురు' అను శబ్దములోగల అంతరార్థాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. 'గు' కారమనగా అంధకారము. 'రు' కారమనగా తన్నివారణ. అనగా, అజ్ఞానాంధకార తత్త్వమును నిర్మూలనముచేసి ప్రకాశవంతమైన హృదయాన్ని అందించుటే ఈ 'గురు' శబ్దోత్పత్తి. ఇంకా లోతుకు దిగి పరిశీలించినప్పుడు, 'గుకారో గుణాతీతః, రుకారో రూపవర్జితః . ఈ గుణాతీత తత్త్వాన్ని ఈ రూప వర్జిత తత్త్వాన్ని తాను అనుభవించి విద్యార్థులకు అందించాలి. అనగా, తన అభిమానమమకారములు విసర్జించి విద్యార్థులు మా బిడ్డలనే ప్రేమతత్త్వాన్ని పెంచుకొని సర్వాభిమానములు విద్యార్థులయందుంచుకొని మనం విద్యను బోధించటానికి ప్రయత్నించాలి.

ఈవిధమైన భావములచేత మనము 'సత్యసాయి బాలవికాస్' లో ప్రవేశించినప్పుడు దీనికొక సార్థకత ఏర్పడుతుంది. అయితే బాలవికాస్ గురువులు చాలా ఉత్తమమైన అభివృద్ధిని, పవిత్రతను అందిస్తున్నారనే సత్యము 'సాయికి' తెలియకపోలేదు. మధ్యమధ్య ఒక 'బ్యాటరీ' ని 'ఛార్జి' చేసినట్లుగా ఈవిధమైన కొన్ని దోషములను మీకు ఎత్తిచూపుట ద్వారా, కొన్ని అభివృద్ధి మార్గములను మనము కాంక్షించుట అత్యవసరము. మీకు నిత్యజీవితములో కొన్ని అనుభవములు ఉండవచ్చును. పెట్రొమాక్సులైటుకు పంపుకొట్టినప్పటికీ అప్పుడప్పుడు దానికి పిన్ను తిప్పాలి. అయితే ఎంత పంపు కొట్టినప్పటికీ, ఎంత పిన్ను చేసినప్పటికీ, అందులో కొంత 'కిరోసిన్' అనే 'ఆయిల్' కూడను చేరివుండాలి. 'కిరోసిన్' అనేది మన శ్రద్ధ. మన ప్రేమయే పిన్ను. మన విశ్వాసమే పంపు. ఈవిధముగా మూడిటినీ చేర్చుకున్నప్పుడే దివ్యప్రకాశాన్ని ఇతరులకు అందించటానికి వీలు ఏర్పడుతుంది. వీటన్నిటికీ ఆధారమై దివ్యమైన నామమనే వత్తి లైటుకు ప్రధానము. ఇట్టి భావములచేత మనము బాలవికాస్ గురువులుగా ప్రవేశించినందులకు, దేశమునందు అనాది కాలమునుండి ఆవరించిన ఈ అజ్ఞాన తత్త్వాన్ని మన ప్రయత్నము ద్వారా కొంత పరిహరించి దివ్యాత్మతత్త్వాన్ని ప్రకటించుటకు తగిన ప్రయత్నము చేయాలి. నాలుగు సంవత్సరములనుండి మనము బాలవికాస్ గురువులుగా పనిచేస్తున్నాము. కానీ, ఈ పని ద్వారా మనకు కలిగిన ఫలితమేమని ఈ సమావేశములో చర్చించి, దానికి తగిన కూర్పులు, మార్పులు సవరించుకొనుటకు మనం ప్రయత్నం సలపాలి. గురువులుకూడా కొన్ని గుంపులు గుంపులుగా ఏర్పడి వారి వారి స్వానుభవములను తర్కించి దానికి సంబంధించిన మార్పులు అభివృద్ధి చేసుకొని ఈ సమావేశములో ఒక నిర్ణయాన్ని తీసుకోవాలి.

ఏవిధమైన మార్గాన్ని మనం అవలింబించినప్పుడు విద్యార్థుల అభివృద్ధిని, దేశాభివృద్ధిని, సమాజ సుక్షేమాన్ని కాక్షించినవార మగుదమను విషయమునుకూడా కొంత విచారించాలి. ఎట్టి ప్రవర్తనలు వారికి బోధించిన భవిష్యత్తులో వారు భద్రమగు జీవితాన్ని అందించగలరు, అనే విషయాన్ని కూడా విచారించాలి. కాన, అధ్యాపకులనగా కేవలము దేశమునకు ఆదర్శవంతమైన జ్యోతులని విశ్వసించాలి. ఒక విద్యార్థి చెడితే కేవలము తాను మాత్రమే చెడగలడు. ఒక అధ్యాపకుడు చెడితే అనేక నూర్లమంది చెడటానికి అవకాశముంటుంది. అధ్యాపకులు 'గైడుపోస్ట్'వంటివారుగా నిలవాలి. ఈవిధమైన విద్యార్థులకు సరియైన ఆదర్శము నందించటములో తాము నిశ్చల మనస్సుతో వుండాలి. 'గైడుపోస్ట్' ఊరికే అటూఇటూ తిరుగుతుండటం తప్పుదారి పట్టిస్తుంది. 'గైడుపోస్ట్' స్థిరంగా నిల్చుకొని దృక్పథాన్ని చక్కగా ఇతరులకు వివరించాలి. అధ్యాపకులైన మనము, ఒకే నిశ్చలమైన భావము, ఒకే నిశ్చలమైనహృదయము, సంకుచిత దురుద్దేశాన్ని దూరంచేసుకునే ప్రేమతత్త్వాన్ని పెంచుకోవాలి. భక్తిప్రపత్తులనుకూడా అభివృద్ధిగావించుకోవాలి. ఏది చేసినప్పటికినీ భగవదర్పితముగా మనము భావించి ఆచరించాలి. కనుక, సర్వత్రా నిండిన సర్వేశ్వరత్వాన్ని మనం హృదయంలో నింపుకొని విద్యార్థుల హృదయాలకు హత్తుకొనునట్లు చేయుటకు పూనుకోవాలి. ఈవిధమైన ఉన్నత భావములచేత, మన గురుత్వాన్ని చాటుటకు పూనుకోవాలి. ఎట్టి ఫలితము లేకపోయినప్పటికిని స్వార్థరహితమైన సేవచేసే మీబోటి గురువులు ఈనాడు లోకానికి ఎంతైనా అవసరం. ఏ ఫలితమూ మీకు చిక్కకపోయినప్పటికీ దైవానుగ్రహమనే గొప్ప ఫలితము మీకు చిక్కుతుంది. ఈనాడు కేవలము జీతములకోసమై ప్రాకులాడే అధ్యాపకులు అధికమైపోవటంచేత స్వార్థరహితులైన అధ్యాపకులను గుర్తించటానికి వీలుకాని పరిస్థితిలో ఉన్నది. విద్యార్థులకు మీరు బోధించాలి.

విద్య డిగ్రీల కొరకనే వెట్టి వీడి
సేవకావృత్తి నీవెప్డు సేయబోక
దేశసౌభాగ్యమెన్నుచు దీటులేక
గడపవలయును జీవిత గరిమమింత.

భారమైన డిగ్రీలు తలమీద పెట్టుకొని మరింత భారమును అనుభవించేదానికంటే ఉత్తమమైన ప్రేమతో హృదయమును నింపుకోవాలి. కేవలం విద్యతో బుఱ్ఱను నింపుకోటం కాదు. లోకములోనున్న విషయములన్నింటినీ తలలో చేర్చుకొని తబ్బిబ్బైపోయే జీవితాన్ని మనం గడపకూడదు. గొప్ప విద్యావంతులైపోయి, వేలకువేలు, లక్షలకు లక్షలు ధనమును ఆర్జించిన ధీరులుకూడను లేకపోలేదు. ఈ జగత్తులో కేవలము, వారి విద్యలన్నియూ ధనార్జనకై ధారపోస్తున్నారుగానీ, దేశముయొక్క సుక్షేమమునకు ఏమాత్రమూ వారు ప్రాకులాడటం లేదు. అట్టి విద్యావంతుల వల్ల దేశమునకు ఏమాత్రమూ ఉపయోగముండదు. తమ పొట్టను తాము నింపుకొని, తమ కుటుంబాన్ని తాము పోషించుకొని, తమ పేరుప్రతిష్ఠలకై ప్రాకులాడే విద్యావంతులు అధికంగావటంచేతనే మన పవిత్ర భరతదేశ సంస్కృతి ఈనాడు సన్నగిల్లిపోయింది.

త్యాగమునకు మించిన గుణము మరొకటి లేదు. త్యాగమే గుణములన్నింటికీ చక్రవర్తి వంటిది. దీనిని పురస్కరించుకొనియే ఉపనిషత్తులలో 'నకర్మణా నప్రజయా ధనేన, త్యాగేనైకే అమృతత్వమానశుః' అని వున్నది. కనుక, నీవు త్యాగశీలుడవై పవిత్రమైన భావముచేత ఆర్జించిన విద్యను బాలురకు అందించి తద్వారా దేశ కళ్యాణమును కోరుతూ రావాలి. ఇట్టి పవిత్రమైన చిత్తశుద్ధితో నిర్మల, నిశ్చల హృదయులైన విద్యార్థుల తత్త్వాన్ని అభివృద్ధిచేయుటలో సత్యసాయి బాలవికాస్ గురువులు ఎంతైనా పాటుపడగలరు. అభివృద్ధిని ఆశిస్తారు. శ్రమించి గొప్ప ఫలితాన్నికూడా దేశానికి అందిస్తారని నేను గాఢంగా విశ్వసిస్తున్నాను. ఈవిధమైన కార్యక్రమాన్ని ఈనాడు మనం ప్రారంభించి, నేడు రేపు మనం చర్చించవలసిన చర్చల్లో సరియైనటువంటి నిర్ణయాలు తీసుకొని, ఆ నిర్ణయాలను కేవలము కాగితములో మాత్రమే చేర్చకుండా, ఆచరణలో వుంచుటకై మీరందరూ ప్రయత్నిస్తారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.